క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



గెదళ్ళవంపు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మొగల్తూరు: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలని ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్ కుమార్ సూచించారు. సోమవారం ముత్యాలపల్లి పంచాయతీ గెదళ్ళవంపు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, వండిన పదార్థాలు రుచిగా ఉంటున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న దాత

నరసాపురం: పట్టణంలోని 30వ వార్డు గ్రేస్ నగర్ హైస్కూల్లో విద్యార్థులకు స్థానిక చర్చి ఆధ్వర్యంలో ఫాస్టర్ సీహెచ్ జాన్‌బాబు సైకిళ్లు పంపిణీ చేశారు. 15 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక వార్డు కౌన్సిలర్ అడిదల శ్యామల ముఖ్య అతిథిగా హాజరై చర్చి పెద్దలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ నల్లి మల్లి జోసఫ్, అడితల శరత్ పాల్గొన్నారు.

దేవాంగ మహిళా ప్రధాన కార్యదర్శిగా రాజశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న రాజశ్రీ

నరసాపురం రూరల్: రాష్ట్ర దేవాంగ మహిళా ప్రధాన కార్యదర్శిగా నరసాపురం మండలం వేములదీవికి చెందిన ఉపాధ్యాయిని ఉప్పుగంటి రాజశ్రీ ఎంపికయ్యారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర దేవాంగ ద్వితీయ కార్యవర్గ సమావేశంలో సంఘ అధ్యక్షుడు డీకే నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి మహిళా దేవాంగ కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వర్తించి సంఘ పురోభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా పలువురు రాజశ్రీని అభినందించారు.

సెల్‌ఫోన్‌కు బానిసలు కావొద్దు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మంగతాయారు

పాలకొల్లు సెంట్రల్: సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరికీ ముఖ్యమైన వస్తువని కాని దానిని అవసరం మేరకు మాత్రమే వాడుకోవాలే తప్ప దానికే బానిసగా మారకూడదని స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డి మంగతాయారు అన్నారు. సోమవారం స్థానిక మాంటిస్సోరి స్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. జడ్జి మంగతాయారు మాట్లాడుతూ విద్యార్థులు సమాచార సేకరణకు మాత్రమే సెల్‌ఫోన్‌ను ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ వసంతలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జాతర నిర్వహణపై సమీక్ష

తణుకు: ఇరగవరం మండలం రేలంగిలో మంటలాంబ జాతర మహోత్సవాలు ఏర్పాట్లపై సేవల కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అద్దగర్ల వెంకటరత్నం, ఇరగవరం ఎస్సై కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎల్.లోకనాథ్ పాల్గొన్నారు.

ముగిసిన క్రీస్తు సువార్త సభలు

పెంటపాడు: జట్లపాలెంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న క్రీస్తు సువార్త స్వస్థత సభలు సోమవారంతో ముగిసాయి. పడాలకు చెందిన వాక్యజ్యోతి మినిస్ట్రీస్ వ్యవస్థాపకురాలు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ మాట్లాడుతూ బైబిలు ప్రకారం ఏసుక్రీస్తు లోకానికి వెలుగై ఉన్నాడని తెలిపారు. ఆయన చూపిన బాటలో విశ్వాసులు జీవించాలన్నారు. నిత్యం ప్రార్థనలతో గడపాలన్నారు. ఫాస్టర్లు కె. ఘనరాజు, జాజి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం



ఉల్లంపర్రులోని దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కనకదుర్గమ్మను ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు – మార్టేరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఉల్లంపర్రులోని దుర్గామల్లేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు అల్లు శ్రీనివాసరావు, ఉమాదేవి దంపతులతో అర్చకులు దేవరకొండ భాస్కరశర్మ, బాదంపూడి బాల సాంబమూర్తి బ్రహ్మత్వంలో కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి గ్రామ, గ్రామేతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఉత్సవ కమిటీ పెద్దలు ఎంఎస్ వాసు, రావాడ సతీష్, ప్రసాద్, శ్రీ లలితా పారాయణ కమిటీ సభ్యులు, భక్తులకు సేవలందించారు.

కనకదుర్గమ్మకు దర్బారు సేవ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కనకదుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం దర్బారు సేవ నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఇరగవరం వేద పండితులతో వేదపారాయణ, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. రాత్రి అడ్డాల ప్రసాద్ భాగ్యలక్ష్మి దంపతులతో అమ్మవారికి దర్బారు సేవ ఏర్పాటు చేశారు. ముందుగా అమ్మవారిని ఊరేగింపుగా సుబ్బారాయుడు ఆలయానికి తీసుకువచ్చి పూజలు నిర్వహించి తిరిగి ఆలయానికి తీసుకువెళ్లి దర్బారు సేవ కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కావలి శ్రీనివాసు, సభ్యులు రేలంగి నరసింహరావు, దాశిరెడ్డి శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది రాంబాబు, కాసా సత్యనారాయణ పాల్గొన్నారు.

లేసు అల్లికలకు అంతర్జాతీయ గుర్తింపు



విశాఖలో పారిశ్రామిక వేత్తల సదస్సులో పాలకొల్లుకి చెందిన బొండపల్లి గిరిజ ప్రదర్శించిన లేసులను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పాలకొల్లు అర్బన్: ఉభయ గోదావరి జిల్లాల్లో మహిళల లేసు అల్లికలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఏఎంసీ మాజీ డైరెక్టర్, వైసీపీ నాయకురాలు బొండపల్లి గిరిజ సోమవారం తెలిపారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన పారిశ్రామికవేత్తల సదస్సులో లేసు అల్లికలను ప్రదర్శించినట్లు గిరిజ తెలిపారు. సీఎం జగన్ లేసు అల్లికల ఎగ్జిబిషన్‌ను సందర్శించారన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో మహిళల చేతిలో తయారయ్యే లేసు అల్లికలకు ఎంతో గుర్తింపు ఉందన్నారు. వీటికి అంతర్జాయంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కరాటే పోటీల్లో భవన్స్ విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీలో విజేతలు

పాలకొల్లు సెంట్రల్: కరాటే పోటీల్లో భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం స్థానిక పూలపల్లి అంబేద్కర్ ఫంక్షన్ హాల్‌లో ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 11 మంది విద్యార్థులు పాల్గొనగా 11 బంగారు, ఒక రజిత పతకాన్ని కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ భవానీ సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న విజేతలు 8వ తరగతికి చెందిన మోక్షజ్ఞ, పి పరీనాకుమారి, ఎస్ షారోని, ఎమ్ మోహిత్, ఎమ్ మహేష్, జి రాహుల్, 7వ తరగతికి చెందిన ఎమ్ రోహిత్, 6వ తరగతికి చెందిన ఎస్ కోమల, టి ప్రమోద్, 5వ తరగతి టి సాహిత్య, 4వ తరగతి ఎ జశ్వితారమ్మ గెలుపొందారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎమ్.ఎస్.ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు విజేతలతో పాటు కరాటే కోచ్ కె.ఎస్.ఎమ్ రాజును అభినందించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో నిర్వహించిన ఏపీ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణ జపాన్ షోటోఖాన్ కరాటే డూ కనంజుకు ఆర్గనైజేషన్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన స్టేట్ పోటీల్లో తమ విద్యార్థులు 23 మంది పాల్గొనగా 21 మంది బంగారు పతకాలు, 15 మంది సిల్వర్ పతకాలు సాధించినట్లు ఇన్‌స్ట్రక్టర్ ధనాని సూర్యప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా కరాటే ఇన్‌స్ట్రక్టర్స్ సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎస్ అప్పలస్వామి తదితరులు విజేతలను అభినందించారు.

నవరత్న పథకాలపై విస్తృత ప్రచారం



శివదేవుని చిక్కాలలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ పార్కి వెంకటరత్నం

పాలకొల్లు అర్బన్: నవరత్న పథకాలపై విస్తృత ప్రచారం చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలిచేలా గృహ సారథులు కృషి చేయాలని మండల గృహ సారథుల కన్వీనర్ పార్కి వెంకటరత్నం కోరారు. పాలకొల్లు మండలం తిల్లపూడి, శివదేవునిచిక్కాల, గవరపేట, బల్లిపాడు, దగ్గులూరులో సోమవారం గృహ సారథుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. శివదేవునిచిక్కాల గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో వెంకటరత్నం మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు నవరత్నాల పథకాలు అందకుంటే వారి వివరాలను తెలియజేయాలన్నారు. మండలంలోని అర్హులైన లబ్ధిదారుల వివరాలన్నీ జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, సర్పంచ్ దిడ్ల మణి వజ్రం, ఎంపీటీసీ మేడిది స్వర్ణ, ఉపసర్పంచ్ ఆకుల నాగమురళి, పిల్లి శ్రీనివాసు, ర్యాలి వర్ధిని తదితరులు పాల్గొన్నారు.

సృష్టిలో మహిళల స్థానం ప్రత్యేకం



పెనుగొండలో విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ సోనీ, ప్రిన్సిపాల్ అప్పారావు

పెనుగొండ: తల్లిగా, చెల్లిగా, భార్యగానే కాకుండా, సమాజాభివృద్ధిలోనూ ముందంజ వేస్తున్న మహిళకు సృష్టిలో ప్రత్యేక స్థానం ఏర్పరచుకొందని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. సోమవారం పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్,ఎ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఫిజికల్ డిపార్ట్ మెంట్ సంయుక్తంగా మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సర్పంచ్ శ్యామలా సోనీ మాట్లాడుతూ మహిళ ప్రతి విషయంలో సమాజంలో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఇంగ్లీషు విభాగాధిపతి కే శశికుమార్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనరు ఏఎన్ రమామణి, అధ్యాపకులు వి కవితాకుమారి, పీవై కృపావరం, సూపరింటెండెంట్ ఎస్ సూర్యనారాయణ, కే శ్రీలక్ష్మీ, నక్కా వేదవ్యాస శాస్త్రి, పి లక్ష్మీ కాంతమ్మ, మల్లీశ్వరి, టి దివాకర్, పి మీరయ్య, ఆర్ఎన్ శ్రీనివాసు, కే సురేష్ బాబు పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సుల ప్రారంభం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సుబ్బారావు

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచస్థాయి నాయకులైన మార్టిన్ లూథర్, నెల్సన్ మండేలా, ఒబామా వంటి ప్రముఖులు గాంధీ సిద్ధాంతాల ద్వారా ప్రభావితులయ్యారని నరసాపురం వైఎన్ కళాశాల గాంధియన్ ఫిలాసఫీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పి సుబ్బారావు తెలిపారు. సోమవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గాంధీయన్ ఫిలాసఫీ, జర్నలిజంపై మూడు నెలల సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచమంతా గాంధీ సిద్ధాంతాలపై మొగ్గు చూపుతున్నారని తెలిపారు. విద్యార్థులు ఈ కోర్సులు నేర్చుకోవడం వల్ల మానసిక ఒత్తిడిని జయించి ప్రశాంత వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించవచ్చని అన్నారు. విద్యార్థులు డిగ్రీతో పాటు అదనపు సర్టిఫికెట్ కోర్సులను అభ్యసించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకులు నోబుల్ రాజు, శిరీష్, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కనకరత్నమాల



ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అడిషనల్ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కనకమాల

పెనుగొండ: ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అడిషనల్ కోశాధికారిగా ఆచంట మండలం భీమలాపురానికి చెందిన వాక్లర్స్ క్లబ్, ఆర్యవైశ్య సేవా మండలి అధ్యక్షురాలు కొత్త కనక రత్నమాల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. సోమవారం కనకరత్నమాల భీమలాపురంలో మాట్లాడుతూ శ్రీశైలం వాసవీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏపీ అధ్యక్షురాలు నాళం ఆండాలు నియామక పత్రం అందించినట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన కనక రత్నమాలను మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి, అంబికా కృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా కొత్త కనకరత్నమాల మాట్లాడుతూ 1983 నుంచి 2023 వరకూ చేస్తున్న సేవలకు గుర్తింపుగా పదవి లభించినట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకూ 100కు పైగా అవార్డులు తీసుకున్నట్లు వివరించారు.

11న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్

నరసాపురంరూరల్: రాజీ చేసుకోదగ్గ సివిల్, క్రిమినల్ కేసులు మనోవర్తి, చెక్‌బౌన్స్, రోడ్డు ప్రమాదాలు, మొండి బకాయిల కేసులు వంటి వాటిని ఈ నెల 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్ అన్నారు. సోమవారం నరసాపురం మండలం లిఖితపూడి గ్రామ సచివాలయంలో మండల న్యాయసేవా సంస్థ ఆదేశాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయవాదులు కటికిరెడ్డి తరుణ్‌కుమార్, నారిన శ్రీనివాస్, గన్నాబత్తులత శివాజీ చక్రవర్తి, ఇంజేటి జాన్‌కెనడీ, నక్కా ఆనందబాబు, కొప్పినీడి చిట్టి పద్మజ, డి చాముండేశ్వరి, కె శిరీష, పి విజయదుర్గ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దానేశ్వరి అమ్మవారికి దాతల విరాళాలు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేంచేసియున్న దానేశ్వరి అమ్మవారి ఆలయం పునః నిర్మాణానికి విశాఖ పట్టణానికి చెందిన భక్తులు రూ. 1 లక్ష 116 విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం విశాఖపట్టణానికి చెందిన బూరిలా ప్రసాదరావు దంపతులు దానేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రూ. 1,00,116 లను విరాళం చెక్కును ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణకు అందజేసినట్లు తెలిపారు.

మహిళలకు ఎల్ఈడీ బల్బుల తయారీపై శిక్షణ

పోడూరు: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ పరకాల సూర్యమోహన్ తెలిపారు. కవిటంలోని ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం ఆయనతో పాటు ట్రస్ట్ కార్యదర్శి పరకాల రమేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ రథాంగపాణి సమావేశంలో మాట్లాడారు. మార్చి 8న గోపరాజు సీతాదేవి జ్ఞాపకార్థం వృద్ధులకు, గర్భిణులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు, పౌష్టికాహారం పంపిణీ చేస్తామని తెలిపారు. నెట్ క్రేకర్ ఇండియా సంస్థ సౌజన్యంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఎల్ఈడీ బల్బుల తయారీపై నెలరోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

కుంగుతున్న గోదావరి గట్టు రోడ్డు



ధ్వంసమైన గోదావరి గట్టు రోడ్డు

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమవుతోంది. పడవల రేవు నుంచి కొండాలమ్మ గుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులు పడ్డాయి. రోడ్డు చాలాచోట్ల కంగిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు గుండా నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ముఖ్యంగా వాకింగ్ వాక్ చేసేవారు. సాయంత్రం వేళలో గోదావరి తీరానికి విహారానికి పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. రోడ్డు సవ్యంగా లేకపోవడంతో ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిపెట్టి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణం



కాళీపట్నంలో రోడ్డు మార్జిన్లు తవ్వుతున్న దృశ్యం

మొగల్తూరు: మండలంలోని కాళీపట్నం పాతపాడు వయా జగన్నాథపురం ప్రధాన రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం కాళీపట్నం పడమరలోని శివాలయం నుంచి పల్లిపాలెం వరకు రహదారికిరువైపులా మార్జిన్లు తవ్వుతున్నారు. కాళీపట్నం తూర్పు పడమర గ్రామాలను కలుపుతూ కాళీపట్నం కాలువపై నిర్మించిన శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి దాని స్థానంలో నూతన వంతెనను నిర్మించి కాళీపట్నం పడమర పాతపాడ వయా జగన్నాథపురం వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. పరిపాలనా పరమైన అనుమతులు రావడంతో చురుగ్గా పనులు చేపట్టారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

అత్తిలి: విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టుసాధించి, ఉన్నత విద్యలను అభ్యసించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఇంగ్లీషు గ్రామర్ డే' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దత్ మాట్లాడుతూ దేశ, విదేశాలకు ఎక్కడకు వెళ్లినా ఆంగ్లభాష తప్పక అవసరమన్నారు. ఆంగ్ల భాషపై పట్టుసాధిసే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చాన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రావిపాడు ఉన్నత పాఠశాల నుంచి వచ్చిన ఆంగ్ల ఉపాధ్యాయుడు బాలకృష్ణ పార్ట్ ఆఫ్ స్పీచ్ గురించి విద్యార్థులకు వివరించారు. ఆంగ్లభాషను అందరూ ఇష్టంతో నేర్చుకోవాలని కోరారు. పాఠశాల తరపున బాలకృష్ణను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రైమ్స్, సాంగ్స్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు జి ఈశ్వరరావు, ఎం వెంకటేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం, పురుషోత్తం, షర్మిల, యామిని, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం రూరల్: ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మాజ్యోతిబా పూలే రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023–2024 విద్యాసంవత్సరానికి ప్రవేశ పరీక్షా పద్ధతి ద్వారా 5వ తరగతిలో ప్రవేశాలకు బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని లక్ష్మణేశ్వరం ప్రిన్సిపాల్ శైలజ సోమవారం అన్నారు. ఈ నెల 6 నుంచి ఏప్రిల్ నెల 4వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. ఇతర సమాచారం కోసం ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

యలమంచిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ రావూరి వెంకటరమణ అధ్యక్షత వహిస్తారని తెలపారు. అధికారులందరూ ఈ సమావేశానికి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు నాయకులతో సమావేశం

నరసాపురం: అన్ని రాజకీయ పార్టీల నేతలతో మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ చెప్పారు. 28వ వార్డు ముసాయిదా పోలింగ్ స్టేషన్ జాబితాను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రచురించామని చెప్పారు. దీనిపై సూచనలు తీసుకుంటామని చెప్పారు.

మెడికల్ ఉద్యోగి మృతి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం ఉల్లంపర్రు పంచాయతీ పరిధిలోని పార్వతీనగర్‌కి చెందిన మెడికల్ ఉద్యోగి కలిగితి అబ్రహాం సామ్యూల్ కృష్టాఫర్ (52) గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇరువురు కవల మగ సంతానం ఉన్నారు. కృష్టాఫర్ మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్ రీజనల్ జాయింట్ డైరెక్టరేట్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ముమ్మిడివరం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయానికి వెళ్లారు. కృష్టాఫర్ భూస్థాపిత కార్యక్రమం సోమవారం పూలపల్లిలోని క్రైస్తవ శ్మశాన వాటికలో నిర్వహించారు.

ముఖ్యమంత్రి దృష్టికి ఆక్వా రైతుల సమస్యలు

పోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహానికి హాజరైన సందర్భంలో జిల్లాలో ఆక్వా రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు జిన్నూరు ఉప సర్పంచ్ దండు వెంకట గోపాలకృష్ణంరాజు సోమవారం తెలిపారు. సీడ్ నాణ్యత లేకపోవడం, మేత, మందులు, సీడ్ ధరలు విపరీతంగా పెరగడంతో చిన్న రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు సీఎంకు వివరించగా ఆక్వా రైతులకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చినట్లు గోపాలకృష్ణంరాజు తెలిపారు.